

పోక్సో కేసులో ఒకరికి ఏడేళ్ల జైలు

కామారెడ్డి టౌన్, ఆగస్టు 8: పోక్సో కేసులో నేరస్తుడికి ఏడేళ్ల కఠిన కారాగార జైలు శిక్ష, 5 వేల జరిమానా విధించినట్లు ఎస్పీ సింధూశర్మ తెలిపారు. లింగంపేట మండలానికి చెందిన 8 ఏళ్ల బాలిక 2018 జూలై 7న ఇంటి బయట ఆడుకుంటున్న చిన్నారిపై అదే మండలానికి చెందిన గుడ్డెల రాములు అనే వ్యక్తి బాలికపై లైంగిక దాడికి పాల్పడినట్లు తెలిపారు. బాలిక తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి కోర్టులో నిందితున్ని ప్రవేశపెట్టగా విచారణ అనంతరం నేరం రుజువు కావడంతో రాములుకు న్యాయమూర్తి శిక్ష వేసినట్లు తెలిపారు.



పంచాయతీల్లో.. పైసల్లేవ్!

కామారెడ్డి, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు గ్రామ పంచాయతీల్లో నిధులు లేక పనులు ముందుకు సాగడం లేదు. కేంద్ర ప్రభుత్వం అందించే 15వ ఆర్థిక సంఘం, స్టేట్ ఫైనాన్స్(ఎస్ఎఫ్‌సీ) నిధులు కూడా ట్రెజరీలో పాస్ కావడం లేదు. దీనికి ఫ్రీజింగే కారణమని అధికార వర్గాలు చెబుతున్నాయి. ఫలితంగా పంచాయతీల్లో నిధుల కొరత వేధిస్తోంది. ప్రస్తుతం వర్షకాలం సీజన్ కావడంతో పారిశుధ్య పనుల విషయంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. నిధులు లేక పారిశుధ్య పనులు చేయలేని పరిస్థితి ఎదురవుతోంది. పారిశుధ్య నిర్వహణ పనులే కాకుండా కార్మికుల వేతనాలు, ట్రాక్టర్లకు సంబంధించిన ఈఎంఐలు, విద్యుత్ చార్జీలు ఇలా నెలనెల చెల్లింపులకు నిధులు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇదిలా ఉంటే గతంలో గ్రామ పంచాయతీల్లో వరుసగా చేపట్టిన అభివృద్ధి పనులకు ఇప్పటికీ బిల్లులు మంజూరు కాలేదు. ఈ ఏడాది ఫిబ్రవరి 1వ తేదీ నుంచి సర్పంచ్‌ల పదవికాలం ముగియడంతో స్పెషల్ ఆఫీసర్ల పాలన కొనసాగుతోంది. జీపీల్లో నిధుల కొరతతో కార్యదర్శులు, ప్రత్యేకాధికారులు పనులకు డబ్బులు సర్దుబాటు చేయలేక తలలు పట్టుకుంటున్నారు.

పారిశుధ్య పనులకు ఇబ్బందులు

జిల్లాలోని పలు గ్రామ పంచాయతీలకు సకాలంలో నిధులు మంజూరు కాక ఆయా జీపీల నిర్వహణ ఇబ్బందిగా మారుతోంది. పనులు చేసిన వాటికి సకాలంలో బిల్లులు మంజూరుకాక అభివృద్ధి, పారిశుధ్య పనులు ముందుకు సాగడం లేదంటున్నారు. పనులన్నీ ఖర్చుతో కూడుకున్నవే కావడంతో వాటిని ఏ విధంగా చేపట్టాలంటూ ప్రత్యేకాధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో పారిశుధ్య నిర్వహణ పంచాయతీలకు సవాల్‌గా మారుతోంది. వర్షాలు కురుస్తున్నందున గ్రామాల్లో పారిశుధ్య పనులు చేయలేని పరిస్థితి ఎదురవుతోంది. ఇక ఇదిలా ఉండగా నెలనెల పంచాయతీల ద్వారా వివిధ పనులకు చెల్లించాల్సిన బిల్లులు పెండింగ్‌లోనే ఉంటున్నాయి. అభివృద్ధి పనులు, కార్మికుల వేతనాలు, ట్రాక్టర్లకు సంబంధించిన ఈఎంఐలు, విద్యుత్ చార్జీలకు నెలనెల చెల్లింపులకు నిధులు లేక ప్రత్యేకాధికారులు తలలు పట్టుకుంటున్నారు.

కార్మికులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితి

గ్రామ పంచాయతీలకు నిధులు కొరత ఉండడంతో పంచాయతీల్లో పనిచేసే కార్మికులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితి ఎదురవుతోంది. జిల్లాలోని మెజార్టీ పంచాయతీల్లో సిబ్బందికి 3,4 నెలల్లో జీతాలు ఇవ్వడం లేదు. వాటర్‌మెన్, పారిశుధ్య కార్మికులకు జీతాలు రాకపోవడంతో ఆందోళనలు చేపడుతున్నారు. ఇటీవల పంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారానికి చలో హైదరాబాద్

- జీపీలను వేధిస్తున్న నిధుల కొరత
- పలు పంచాయతీలకు ఎస్ఎఫ్‌సీ నిధులు ఉన్నా పాస్ కాని చెక్కులు
- కార్మికులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితి
- గ్రామాల్లో పారిశుధ్యంపై స్పెషల్ డ్రైవ్‌కు ఇబ్బందులు
- జిల్లాలో 526 గ్రామ పంచాయతీలు
- ప్రస్తుతం ప్రత్యేకాధికారుల పాలనలో పంచాయతీలు

కార్యక్రమం తలపెట్టారు. కొందరు కార్మికులు పని చేయమని మొండికేస్తున్నారు. కొన్ని పంచాయతీల్లో కార్యదర్శులు తమ సొంత డబ్బులతో సర్దుబాటు చేసి పని చేయిస్తున్నారు. చిన్న గ్రామాల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. కనీసం పాడైన బల్బుల స్థానంలో కొత్తవి పెట్టలేకపోతున్నారు. వర్షాలు విస్తారంగా పడుతున్నాయి. మురికి పేరుకపోయి ప్రజలు రోగాల భారిన పడుతున్నారు. డబ్బులు లేకపోవడంతో శానిటేషన్ పనులకు కూడా ఇబ్బందికరంగా మారింది. ప్రభుత్వం నిధులు విడుదల చేసి పంచాయతీ కష్టాలను తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

ఆర్థిక సంఘం నిధుల కోసం తప్పని నిరీక్షణ

గ్రామ పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం ద్వారా అందే ఆర్థిక సంఘం నిధులు సకాలంలో అందక పలు గ్రామ పంచాయతీలకు నిరీక్షణ తప్పడం లేదు. గత ఏడాదిగా 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల కాకపోవడంతో పంచాయతీల నిర్వహణ ఇబ్బందిగా మారుతోంది. జిల్లాలో 526 గ్రామ పంచాయతీలకు ప్రతీనెల సుమారు 8 కోట్లు 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదలయ్యేవి. కానీ పంచాయతీలకు విడుదల చేస్తున్న నిధులను గత రాష్ట్ర ప్రభుత్వం పక్కదారి పట్టిస్తుందనే ఉద్దేశ్యంతో కేంద్రం 15వ ఆర్థిక సంఘం నిధుల విషయంలో ప్రత్యేక చర్యలు చేపట్టింది. కొత్త బ్యాంకు ఖాతాలు తెరవాలని జీపీలకు సూచించింది. ఈ మేరకు జిల్లాలోని 526 గ్రామ పంచాయతీలు రెండు సంవత్సరాల కిందట కొత్త బ్యాంకు ఖాతాలను తెరిచారు. ఆర్థిక సంఘం నిధులు వినియోగానికి డిజిటల్ కీలను ఇటీవలే అందించారు. కానీ నాలుగు నెలలుగా కేంద్రం నిధులను మాత్రం విడుదల చేయడం లేదు.



ప్రభుత్వం ప్రతీ రైతుకు రుణమాఫీ చేయాల్సిందే..

- అర్హులైన పలువురు రైతులకు రుణమాఫీ కాలేదు
- సాంకేతిక కారణాలు చూపి రైతులకు రుణమాఫీ చేయకపోవడం తగదు
- ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి



రచ్చబండ కార్యక్రమంలో రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి

కామారెడ్డి టౌన్, ఆగస్టు 8: రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ రైతుకు రుణమాఫీ చేయాలని ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి అన్నారు. గురువారం కామారెడ్డి మండలం ఇస్రోజీవాడి గ్రామంలో బీజేపీ రాష్ట్ర కిసాన్‌మోర్చా పిలుపు మేరకు రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చెబుతున్నట్లుగా 1 లక్ష 50 వేల లోపల రుణం ఉన్న ప్రతీ రైతుకు రుణమాఫీ కాలేదని అధికారులు గ్రామాల్లోకి వస్తే ఆ విషయం అర్థమవుతుందని అన్నారు. సాంకేతిక కారణాలు చూపి రైతులకు రుణమాఫీ చేయకపోవడం తగదని అన్నారు. రుణమాఫీ అయ్యే వరకు బీజేపీ అండగా ఉంటుందని అందుకోసం బీజేపీ ఏర్పాటు చేసిన 88861 00097 నెంబర్‌కు ఫోన్ చేసి వివరాలు చెబితే వారి సమస్య పరిష్కారం కోసం అధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. అదేవిధంగా గర్గుల్‌లో పీపుల్ ఫర్ ఇండియా అగ్రిటెక్ సీరిస్ ఆధ్వర్యంలో ఆధునిక వ్యవసాయంలో డ్రోన్ వినియోగంపై చేపట్టిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయంలో టెక్నాలజీని వాడాలని రైతులకు సూచించారు. క్రిమి సంహారక మందుల పిచికారీకి డ్రోన్‌ను వాడటం వల్ల రైతుకు అనేక లాభాలు ఉన్నాయని, పంటకు తగిన మోతాదులో మందు పడటమే కాకుండా వ్యవసాయ కూలీల వ్యయం కూడా తగ్గుతుందని తెలిపారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులు రైతుకు ఎంత గానో మేలు చేస్తాయని తెలిపారు. అనంతరం బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార మాట్లాడుతూ గతంలో సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం ఎలాంటి షరతులు లేకుండా ఆగస్టు 15 వరకు ప్రతీ రైతుకు రూ.2లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు బాస్కర్‌రెడ్డి, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ లక్ష్మారెడ్డి, నాయకులు శ్రీధర్, అనిల్, మహిపాల్, పోచయ్య, ప్రశాంత్, తిరుపతి, నగేష్, సుమన్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

రోగుల రక్త నమూనాలు సేకరించాలి

- జిల్లా వైద్యాధికారి చంద్రశేఖర్

లింగంపేట, ఆగస్టు 8: మండలంలోని గ్రామాల్లో జ్వరాలతో బాధపడుతున్న రోగుల రక్త నమూనాలను సేకరించి పరీక్షలకు పంపాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బందికి సూచించారు. ఆయన గురువారం లింగంపేట మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బందికి నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. డెంగ్యూతో పాటు ఇతర వ్యాధులు రాకుండా మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు ఇంటింటికీ వెళ్లి జర్వ సర్వే నిర్వహించాలన్నారు. జర్వంతో బాధపడుతున్న వారి రక్త నమూనాలను సేకరించి పరీక్షల కోసం ల్యాబ్‌కు పంపించాలని ఆయన ఆదేశించారు. సర్వేలో భాగంగా ఇంటింటికీ తిరిగి వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి హిమబిందు, హెచ్ఈవో చలపతి, సిబ్బంది యాదగిరి, చంద్రకళ, రాజమణిలతో పాటు సిబ్బంది ఉన్నారు.

రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటాలి

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



మొక్క నాటుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి టౌన్, ఆగస్టు 8: రోడ్డుకు ఇరువైపులా పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. గురువారం తాడ్వాయి మండలం బ్రాహ్మణవాడి గ్రామంలో వన మహోత్సవం, స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటారు. ఈజీఎస్ ద్వారా రోడ్డుకు ఇరువైపులా 800 మొక్కలను నాటే కార్యక్రమాన్ని మండల ప్రత్యేకాధికారి, ఎంపీడీవో ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో నాటిన మొక్కలు చనిపోయిన వాటి స్థానంలో మొక్కలను నాటి కంచెను ఏర్పాటు చేసి సంరక్షణ చర్యలు చేపట్టాలని తెలిపారు. ఒక్కొక్క మొక్క నాటి దాని చుట్టు రక్షణ కంచెను ఏర్పాటు చేసేందుకు ఈజీఎస్ కూలీలకు ఎంత కూలి పడుతుందని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి సీపీవో రాజారాం, ఎంపీడీవో సజ్జత్ సాజిద్‌అలీ, పంచాయతీ కార్యదర్శి రేణుక తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ ఓటరు జాబితాను రూపొందించాలి

గ్రామ పంచాయతీ ఓటరు జాబితాను రూపొందించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఎంపీడీవో, ఎంపీవోలు, ఈ-పంచాయతీ ఆపరేటర్లకు అవగాహన చేపట్టారు. పార్లమెంట్ ఎన్నికల్లో రూపొందించిన ఓటరు జాబితా ఆధారంగా గ్రామ పంచాయతీ ఓటరు లిస్ట్ 2024 తయారు చేయడం జరుగుతుందని రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారిక వెబ్‌సైట్ టీపోల్స్‌లో గ్రామ పంచాయతీ ఓటరు జాబితా నుంచి వార్డుల వారీగా మ్యాపింగ్ చేయాలని తెలిపారు. వన మహోత్సవ కార్యక్రమం ద్వారా నాటిన మొక్కల వివరాలను అటవీ శాఖ వెబ్‌సైట్ మేరి లైఫ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని తెలిపారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పరిష్కరించడంపై అధికారులు దృష్టి పెట్టాలని, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ప్రతిరోజూ ఎల్ఆర్ఎస్ డిస్పోజల్‌పై సమీక్షిస్తున్నారని తెలిపారు. దరఖాస్తులను ఫీల్డ్ విజిట్ చేసి ఇరిగేషన్ భూములు, రోడ్డు మార్కింగ్‌లో పోయిన భూములు, వివిధ ప్రభుత్వ ప్రైవేట్ సంస్థల భూములు, పట్టా కాని భూములు తదితర భూములు లేకుండా చూసుకుని ఎలాంటి వివాదం లేని భూముల దరఖాస్తులను జాగ్రత్తగా మండల పంచాయతీ అధికారి, డిప్యూటీ తహసీల్దార్ లేదా రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పరిశీలించి వివాదాలు లేని భూముల దరఖాస్తులను డిస్పోజల్ చేసేందుకు పంచాయతీ అధికారి ద్వారా పంపించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం గోదాంను సందర్శించిన కలెక్టర్

నిజామాబాద్ అర్బన్, ఆగస్టు 8: జిల్లా కేంద్రంలోని వినాయక్‌నగర్‌లోగల ఈవీఎం గోదాంను కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు గురువారం సందర్శించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈవీఎం గోదాంను పరిశీలించారు. గుర్తులు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, అసెంబ్లీ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారుల సమక్షంలో గోదాంను తెరిపించి సెగ్మెంట్ల వారీగా బ్యాలెట్ యూనిట్లు, ఎన్నికల సామగ్రిని భద్రపర్చిన గదులను పరిశీలించారు. కలెక్టర్‌వెంట అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, నగర పాలక సంస్థ కమిషనర్ మకరంద్, ఆర్‌డీవోలు రాజేంద్రకుమార్, రాజేశ్వర్, రాజాగౌడ్, ఎన్నికల విభాగం అధికారులు, అగ్నిమాపక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పంద్రాగస్టు వేడుకలకు ఏర్పాట్లు చేయాలి

● నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

నిజామాబాద్ అర్బన్, ఆగస్టు 8: స్వాతంత్ర్య దినోత్సవాలను పండుగ వాతావరణంలో నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అధికారులకు ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం అన్ని శాఖల అధికారులతో కలెక్టర్ సన్నాహక సమావేశం నిర్వహించారు. పంద్రాగస్టు సందర్భంగా చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి ఆయా శాఖల వారీగా అధికారులకు దిశానిర్దేశం చేశారు. పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో వేడుకలు నిర్వహించనున్నందున అందుకు అనుగుణంగా వేదిక, సిట్టింగ్ ఏర్పాట్లను పక్కాగా చేసుకోవాలని వర్షాలు కురుస్తున్నందున వాటర్ ప్రూఫ్ టెంట్లు వేయించాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో తక్షణ చికిత్స అందించేలా వైద్య బృందాన్ని, 108 అంబులెన్స్‌ను వేడుక వద్ద సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. వివిధ వర్గాల వారి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు ప్రతిబింబించేలా జిల్లా ప్రగతి నివేదిక రూపొందించాలని ఆదేశించారు. వ్యవసాయ, ఉద్యానవన, జిల్లా గ్రామీణాభివృద్ధి, అటవీశాఖ, పశుసంవర్ధక, విద్య, వైద్యం, స్త్రీ శిశుసంక్షేమ, పౌరసరఫరాలు, పంచాయతీరాజ్, తదితర శాఖల పనితీరును చాటేలా శకటాల ప్రదర్శనతో పాటు స్టాల్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. స్థానిక సంస్థలకు పాలకవర్గాలు లేనందున ఉదయం వేళల్లో ప్రత్యేక అధికారులు తమ తమ మండలాలు, గ్రామాల్లో జెండా ఆవిష్కరణ జరిపి జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్‌గ్రౌండ్‌లో నిర్వహించే వేడుకలకు సకాలంలో హాజరుకావాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమాన్ని సమగ్రవంతంగా అమలు చేసిన గ్రామ పంచాయతీలు, మున్సిపల్ వార్డులను సైతం ఉత్తమ జీపీలు, వార్డులుగా ఎంపిక చేయాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, నగర పాలక సంస్థ కమిషనర్ మకరంద్, ట్రైనీ కలెక్టర్ సంకేత్, అదనపు డిసిపి కోటేశ్వర్‌రావు, నిజామాబాద్ ఆర్‌డీవో రాజేంద్రకుమార్, జడ్పీసీఈవో ఉషా, కలెక్టరేట్ ఏవో ప్రశాంత్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రైల్వేలైన్‌ను వ్యతిరేకిస్తూ రైతుల రాస్తారోకో


బాల్కొండ బైపాస్ వద్ద రాస్తారోకో చేస్తున్న రైతులు

ముప్కాల్, ఆగస్టు8: ఆదిలాబాద్ జిల్లా నుంచి రంగారెడ్డి జిల్లా వరకు వేసే రైల్వేలైన్ వ్యతిరేకిస్తూ గురువారం బాల్కొండ బైపాస్ వద్ద రైతులు రాస్తారోకో నిర్వహించారు. నూతన రైల్వేస్టేషన్ కోసం ఇటీవల అధికారులు సర్వే చేశారు. ఈ సర్వే లైన్‌తో బాల్కొండ, ముప్కాల్, మెండోర తదితర మండలాల రైతుల విలువైన భూములు కోల్పోతున్నామని వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వ్యవసాయమే మా జీవనాధారమని, అందుకు మేము విలువైన భూములు ఇవ్వడానికి ఒప్పుకోమని భీష్మించుకొని కూర్చున్నారు. చివరకు బాల్కొండ పోలీసులకు రైతులకు నచ్చజెప్పి ఆందోళనను విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో బాల్కొండ చిట్టాపూర్, బోదేపల్లి, చేపూర్, వేంపల్లి, కొత్తపల్లి, తదితర గ్రామాల రైతులు పాల్గొన్నారు.

రైతులకు తూతూ మంత్రంగా రుణమాఫీ : కులాచారి

పెద్దబజార్,ఆగస్టు 8:ఏకకాలంలో రుణమాఫీ చేశామని ప్రభుత్వం చెబుతున్నా వాస్తవంగా రైతులందరికి రుణమాఫీ జరగలేదని దాంతో రైతులు ఆవేదన చెందుతున్నారని,65లక్షల మంది రైతులకు గాను 10లక్షలకు పైగా మంది రైతులకు మాత్రమే రుణమాఫీ జరిగిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్‌కులాచారి అన్నారు. గురువారం నగరంలోని బీజేపీ కార్యాలయంలో జిల్లా పదాధికారుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

● భూమి అమ్మి అప్పులు కడదామంటే ధరణిలో ఎక్కలేదని వాపోయిన రైతు


రాజేష్ (ఫైల్)

జక్రాన్‌పల్లి, ఆగస్టు 8: నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి మండలం అర్గుల్ గ్రామానికి చెందిన కుంట రాజేష్(42) అనే రైతు అప్పుల బాధతో గురువారం సాయంత్రం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్సై తిరుపతి తెలిపారు. అర్గుల్ గ్రామానికి చెందిన రైతు కుంట రాజేష్ ఇటుక బట్టీల తయారీతో పాటు వ్యవసాయం చేసుకుంటున్నాడని, దీంతో అప్పులు పెరిగి తన పొలంలో చెట్టుకు ఉరి వేసుకున్నాడని ఎస్సై తెలిపారు. ఇటుక బట్టీలో సుమారు రూ.12 లక్షలు అప్పులు అయ్యాయని, ఉన్న డబ్బులు లేబర్‌ల మీదనే ఉండిపోయాయని తెలిపారు. అప్పులు కడదామంటే తనకున్న రెండు ఎకరాల భూమి ధరణిలో తన పేరు మీద ఎక్కలేదన్నారు. దీంతో అప్పులు ఇచ్చిన వారు ఇంటికి వచ్చి ఇబ్బందులు పెట్టారని, అయినప్పటికీ చేసిన అప్పులకు నెలనెలా వడ్డీలు కడుతున్నానని అర్గుల్ వాట్సప్ గ్రూపులో మృతుడు రైతు రోదిస్తూ వాయిస్ రికార్డు పెట్టారని తెలిపారు. తన మాదిరిగానే ధరణిలో భూములు ఎక్కని రైతులు చాలా మంది ఉన్నారని వాటని ధరణిలో ఎక్కించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్, పోలీసులకు ఆత్మహత్యకు ముందు అర్గుల్ వాట్సప్ గ్రూప్‌లో పెట్టాడు. ప్రభుత్వం తన కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య కుంట లలిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య కుంట లలిత, ఇద్దరు కుమారులు ఉన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో సీజనల్ వ్యాధులను అరికడదాం

● జిల్లా ఆరోగ్య విద్యాబోధకుడు ఘన్‌పూర్ వెంకటేశ్వర్లు


మాట్లాడుతున్న ఘన్‌పూర్ వెంకటేశ్వర్లు

పెద్దబజార్, ఆగస్టు 8:పరిసరాల పరిశుభ్రతతో సీజనల్ వ్యాధులను అరికడదామని జిల్లా ఆరోగ్య విద్యాబోధకులు ఘన్‌పూర్ వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం నగరంలోని సీతారాంనగర్ కాలనీకి చెందిన పట్టణ ఆరోగ్య కేంద్రంలో గొల్లగుట్టలోని ప్రభుత్వ గిరిజన బాలికల డిగ్రీ కళాశాల విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ఆరోగ్యంలో భాగంగా వ్యక్తిగత ఆరోగ్యం, కుటుంబ ఆరోగ్యం, సామాజిక ఆరోగ్యం, ఆధ్యాత్మిక ఆరోగ్యం ప్రధానమైనవని అన్నారు. అదేవిధంగా సీజనల్ వ్యాధుల్లో ప్రధానంగా వర్షాకాలంలో వ్యాపించే వ్యాధులపై దృష్టిసారించాలన్నారు. కీటక, జనిత వ్యాధులను నియంత్రణలో మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా, మెదడువాపు, ఫైలేరియా ముఖ్యమైనవని అన్నారు. దోమల నియంత్రణకు ఇంటి పరిసరాలలో నీటినిల్వలను తొలగించాలని డ్రైనేజీలో పేరుకుపోయిన మురుగు, ప్లాస్టిక్, చెత్తా చెదారాన్ని తొలగించాలన్నారు. ఇంటి పరిసరాలలో వాడి పారేసిన గ్లాసులు, కప్పులు, సీసలు, బకెట్లు, పగిలిన కుండలు, పాత టైర్లు మొదలగు వాటిలో నీరు నిలువకుండా వాటిని తొలగించాలన్నారు. ఇండ్లలో వాడేటువంటి కూలర్లు, నీటితొట్టిలు, సంప్‌లు ప్రతీ శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా శుభ్రపరిచి ఎండబెట్టి మరుసటి రోజు నీటిని పట్టుకోవాలని అన్నారు. లేనిచో డెంగ్యూ దోమలు అందులో పెరిగి ఇండ్లలో నివసించే వారికి కుట్టడంతో డెంగీ వ్యాధి వ్యాపిస్తుందని అన్నారు. మలేరియా, చికున్‌గున్యా, మెదడువాపు, బోదకాలు ప్రబలకుండా జాగ్రత్త పడాలన్నారు. ప్రతీ ఆదివారం ఉదయం 10గంటలకు పది నిమిషాల పాటు ప్రతి ఇంటి వద్ద నీటినిల్వలను తొలిగిస్తే పరిసరాలు పరిశుభ్రత పాటించినప్పుడు దోమల నియంత్రణ జరుగుతుందని అన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రజలందరూ వైద్య సిబ్బందికి, ఆశలు, ఏఎన్ఎంలకు సహకరిస్తే సీజన్‌లో దోమల ద్వారా వ్యాపించే వ్యాధులు నియంత్రించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సైదా నజీబ్, అధ్యాపకులు భార్గవి, సుశ్మిత, స్టాఫ్ నర్సులు సుశ్మిత, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

● కోమన్‌పల్లి కళాశాలలో సీజనల్ వ్యాధులపై అవగాహన

ఆర్మూర్‌రూరల్: ఆర్మూర్ మండలం కోమన్‌పల్లి గ్రామంలో సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వంశీకృష్ణ మాట్లాడుతూ వర్షాకాలంలో విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని, పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. తమ ఇంటి పరిసరాల్లో వర్షపు నీరు, మురికినీరు నిల్వ కుండా చూడాలని దీని వల్ల దోమలు వ్యాప్తి చెంది మలేరియా లాంటి జ్వరాలు సోకుతాయని అన్నారు. హెచ్ఎం కవిత, జీవశాస్త్ర ఉపాధ్యాయుడు పెద్ద చిన్నయ్య విద్యార్థులకు పౌష్టికాహారం, పండ్ల వినియోగం, దోమ తెరాల వాడకంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నవీన్,శ్యామల,ఉమారాణి,కారోబార్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌టౌన్: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు జాగ్రత్త వహించాలని గురువారం సీడీఎంపీ ప్రత్యేక అధికారి అన్నపూర్ణమ్మ, మున్సిపల్ కమిషనర్ రాజులు తెలిపారు. మున్సిపల్ పరిధిలోని 24వార్డులో నిల్వ ఉన్న నీటిలో దోమల లార్వలను నివారించేందుకు గంబుజీయ చేప పిల్లలను వదిలారు. అంతకు ముందు సాంఘీక సంక్షేమ మహిళ గురుకుల డిగ్రీ కళాశాలలో స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమంలో విద్యార్థినిలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రిక, ఆకుల రాము, శాల ప్రసాద్, రింగుల భూషణ్, మున్సిపల్ మేనేజర్‌అయ్యూం, అధికారులు గజానంద్, పూర్ణమౌళి, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లిలో ఇంటింటా జ్వర సర్వే


మోర్తాడ్‌లో ఇంటింటికి వెళ్లి ఫీవర్ సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీవో

కమ్మర్‌పల్లి,ఆగస్టు 6:సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా గురువారం కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో ఇంటింటా జ్వరసర్వే కార్యక్రమాన్ని నిర్వహించారు, వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ఈకార్యక్రమంలో ప్రతీఇంటికి వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుంటూ నమోదు కార్యక్రమం చేపట్టారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని,వర్షపు నీరు నిలువకుండా చూసుకోవాలని దోమలవ్యాప్తికి కారణమయ్యే తాగి పడేసిన కొబ్బరి బొండాలు, టైర్లు, కుండీల్లో నీళ్ల నిలవుండకుండా చూసుకోవాలని తగుసూచనలు చేశారు. జ్వరంవచ్చినట్లు తదితర ఇబ్బందులు ఎదురైతే వెంటను ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లాలని సూచించారు గ్రామంలో గురువారం ఆరుటీంలు జ్వరసర్వే నిర్వహించినట్లు గ్రామ పంచాయతీ జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులు తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ఆశావర్కర్‌లు, వీవోఏలు, సిబ్బంది పాల్గొన్నారు.

● ఫీవర్ సర్వే సరళిని పరిశీలించిన అధికారులు

మోర్తాడ్: మండల కేంద్రంలో ఫీవర్ సర్వే సరళిని గురువారం ఎంపీడీవో తిరుమల పరిశీలించారు. మండల కేంద్రంలో ఆశావర్కర్‌లు ఇంటింటికి తిరుగుతూ ఫీవర్ సర్వేను నిర్వహిస్తున్నారు. సర్వే జరుపుతున్న సరళిని అధికారులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీకార్యదర్శి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

నవీపేటలో గంజాయి పట్టివేత


నిందితుడిని పట్టుకున్న ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

సుభాష్‌నగర్/నవీపేట,ఆగస్టు 8:గంజాయి అమ్ముతున్నారన్న సమాచారంతో నవీపేట మండల కేంద్రంలోని రైల్వేస్టేషన్ ప్రాంతంలో తనిఖీలు నిర్వహించారు. గంజాయి అమ్ముతున్న ఒకరిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి 500 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ వెంకటేశ్ తెలిపారు. ఉదయం సయ్యద్ రఫీక్ అనే వ్యక్తి అనుమానాస్పదంగా రైల్వేస్టేషన్ ప్రాంతంలో గంజాయి అమ్ముతుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొని 500 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.ఈసందర్భంగా ఎక్సైజ్ సీఐ వెంకటేశ్ మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్ ఎవరైనా అమ్మిన, కలిగి ఉన్న, సేవించిన చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గంజాయి గురించి ఎవరైనా సమాచారం తెలిస్తే ఎక్సైజ్ అధికారులకు సమాచారం ఇవ్వాలని వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఈ దాడుల్లో వెంకటేశ్, నర్సింహాచారి, భూమన్న, భోజన్న, అవి నాష్, ఉత్తమ్, విష్ణు, రాంబచ్చన్, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ

నిజామాబాద్ లీగల్, ఆగస్టు 8: న్యాయవాదులపై జనగామ జిల్లాలో పోలీసుల భౌతిక దాడిని నిరసిస్తూ గురువారం నిజామాబాద్ జిల్లా కోర్టు చౌరస్తాలో న్యాయవాదులు నిరసన వ్యక్తం చేశారు. నల్ల బ్యాడ్జీలను ధరించి విధులను బహిష్కరించారు. బార్ అసోసియేషన్ అత్యవసర సమావేశం ఏకగ్రీవంగా తీర్మానం చేసినట్లు అధ్యక్షుడు జగన్ మోహన్ గౌడ్ తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయవాదులు కక్షిదారుల ప్రయోజనాలే పరమావధిగా తమ వృత్తి ధర్మాన్ని నిర్వహిస్తారన్నారు. వ్యక్తిగత పనికోసం కాకుండా చట్టబద్ధమైన పనికోసం వెళ్లినవారిని జనగామ పోలీసులు న్యాయవాదులపై జరిపిన భౌతికదాడిని తీవ్రంగా ఖండించాలన్నారు. అనంతరం రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు మంథాని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బార్ అసోసియేషన్ అన్ని గురు, శుక్రవారం రెండు రోజుల పాటు తమ విధులను బహిష్కరించి బాధ్యులైన పోలీసులను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వసంత్‌రావు, ధన్‌పాల్ సురేష్, కోశాధికారి దీపక్, న్యాయవాదులు రెంజర్ల సురేష్, విఘ్నేష్, రవి, విశ్వక్ సేన్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

● రెండో రోజు న్యాయవాదులు విధుల బహిష్కరణ

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని కోర్టు ప్రాంగణంలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం న్యాయవాదులు రెండవ రోజు విధులను బహిష్కరించారు. ఇటీవల జనగామా జిల్లా కేంద్రంలో న్యాయవాద దంపతులను అమృత్‌రావు, కవితలపై దాడికి పాల్పడిన సీఐ రఘుపతిరెడ్డిని విధుల నుంచి తొలగించాలని వారు కోరారు. న్యాయవాదులకు రక్షణ చట్టం తీసుకురావాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తెడ్డు నర్సయ్య, ఉపాధ్యక్షుడు శంకర్, న్యాయవాదులు అరుణ, తుమ్మ సుకేష్, సురేష్, నరేం ధర్, శ్రీధర్, కృష్ణంరాజు, కీర్తిసాగర్, దాస్‌బాబు, జీజీ.రాం, నరేష్, బాబాగౌడ్, కార్తిక్, సంజీవ్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

కాలువలో పడి ఒకరి మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ఖిల్లా, ఆగస్టు 8: కాలువలో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన మూడో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. దుబ్బాక గ్రామానికి చెందిన వడ్ల రమేష్ (53) నగరంలోని గౌడ్స్ కాలనీ వద్ద లారీ మెకానిక్ షెడ్డు వేసుకొని జీవనం సాగిస్తున్నాడని తెలిపారు. సోమవారం దుబ్బాక నుంచి నగరానికి వచ్చిన మృతుడు కాలువలో పడి మృతి చెందినట్లు స్థానికుల ద్వారా తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడికి మద్యం తాగే అలవాటు ఉందని, భార్య మేఘమాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రవీణ్ తెలిపారు.

2వ వార్డులో తల్లిపాల వారోత్సవాలు

ఆర్మూర్‌టౌన్,ఆగస్టు8: పట్టణంలోని 2వ వార్డులో అంగన్‌వాడి కేంద్రంలో గురువారం తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక కౌన్సిలర్ ఖాందేశ్ సంగీత మాట్లాడుతూ తల్లిపాల అవశ్యకత గురించి తల్లులకు వివరించారు. పిల్లలకు అనారోగ్య సమస్యలు రాకుండా ముర్రుపాలు తప్పకుండా ఇవ్వాలని తెలిపారు. గర్భిణులు పాటించాల్సిన ఆరోగ్య సూత్రలను వివరించారు. ఈకార్యక్రమంలో మున్సి పల్ అధికారులు షకీల్, చక్రధర్, కాంగ్రెస్ నాయకులు ఖాందేశ్ సత్యం, నాగలత, సరిత, మమత, జారీన, కవిత, మాధురి, శ్రీలత, గంగ భవాని, నవనీత, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు

● బోధన్ తహసీల్దార్ విఠల్

బోధన్ రూరల్, ఆగస్టు 8 : అక్రమ ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని బోధన్ తహసీల్దార్ విఠల్, రూరల్ ఎస్ఐ నాగ్‌నాథ్ అన్నారు. గురువారం అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న నాలుగు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు వారు తెలిపారు. మంజీర సరిహద్దు గ్రామాల నుంచి అక్రమ ఇసుక రవాణా జరుగుతుందన్న పక్కా సమాచారం మేరకు దాడులు నిర్వహించి ట్రాకర్టర్లను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు. ఇక నుంచి ఎవరైనా ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమ ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వీరి వెంట సాలూర తహసీల్దార్‌తో పాటు రెవెన్యూ, పోలీసు సిబ్బంది తదితరులు ఉన్నారు.

తహసీల్దార్‌పై ఆర్డీవోకు ఫిర్యాదు

నవీపేట,ఆగస్టు8: నవీపేట తహసీల్దార్ నారాయణపై మండలంలోని యంచకు చెందిన పలువురు గ్రామస్థులు గురువారం నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్రకుమార్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామ శివారులో 1994-95 సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం రాజీవ్ గాంధీ తాగునీటి పథకం ఏర్పాటుకు భూమిని సేకరించిందని, దీనికి సంబంధించిన భూమిలో 5గుంటల భూమిని ఇటీవల మాజీ సర్పంచ్ పేరున తహసీల్దార్ పట్టా మార్పిడి చేశారని వారు తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయంపై విచారణ జరపాలని వారు ఆర్డీవోను కోరారు. ఈ విషయంపై తహసీల్దార్ నారాయణను వివరణ కోరగా రికార్డులకు అనుగుణంగా పట్టా మార్పిడి చేయడం జరిగిందని, ఎటువంటి అక్రమాలు జరగలేదని అన్నారు.

విద్యార్థులు ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలి

ఆర్మూర్‌రూరల్, ఆగస్టు8: కళాశాలల్లో సీనియర్ విద్యార్థులు ర్యాగింగ్ పేరిట జూనియర్ విద్యార్థులను వేధించి ఇబ్బందులు పడవద్దని భీమ్‌గల్ ఎస్సై హరిబాబు అన్నారు. గురువారం భీమ్‌గల్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు యాంటి ర్యాగింగ్‌పై అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జైపాల్‌రెడ్డి, అధ్యాపకులు కృష్ణదాస్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పొతంగల్‌లో ఇసుక వేలంపాట

కోటగిరి,ఆగస్టు8: పొతంగల్ తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ఇసుక వేలంపాట నిర్వహించారు. కొడిచర్ల గ్రామంలో నాలుగు ట్రాక్టర్ల ఇసుక డంప్‌ను సీజ్ చేసి వేలంపాట నిర్వహించగా ముగ్గురు వేలంపాటలో పాల్గొన్నారు. కొడిచర్ల గ్రామానికి చెందిన నాగరాజు గౌడ్ అనే వ్యక్తి రూ.2700లకు ఇసుకను దక్కించుకున్నట్లు ఆర్ఐ తెలిపారు.

రాజన్నను దర్శించుకున్న కామారెడ్డి ఎమ్మెల్యే


కోడెమొక్కు చెల్లించుకుంటున్న ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి

వేములవాడ కల్చరల్,ఆగస్టు 8: రాజన్నసిరిసిల్ల జిల్లా వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారిని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి దర్శించుకున్నారు.రాజన్న ఆలయానికి విచ్చేసిన ఆయనకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంకరమణారెడ్డి కుటుంబసభ్యులు రాజన్న ఆలయంలో ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. అనంతరం అర్చకులు ఆశీర్వదించగా ఆలయ సూపరింటెండెంట్ తిరుపతి రావు ప్రసాదాన్ని అందజేశారు.

ఉప్లూర్‌లో బాధిత కుంటుబాలకు పరామర్శ

కమ్మర్‌పల్లి,ఆగస్టు 6:మండలంలోని ఉప్లూర్ గ్రామంలో ఇటీవల వివిధ కారణాలతో మరణించినవారి కుటుంబాలను జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి గురువారం పరామర్శించారు.ఆయనవెంట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సుంకెట రవి, తిప్పిరెడ్డి శ్రీనివాస్, చింతకుంట శ్రీనివాస్, మాజీ సర్పంచ్ బద్దం రమేష్‌రెడ్డి, కొమ్ముల రవిందర్, జిల్లా నాయకులు బోనగిరి భాస్కర్, దేవేందర్, బుచ్చిమల్లయ్య, తిరుపతిరెడ్డి, జిల్లా మైనారిటీ నాయకుడు అబ్దుల్ రఫీ, ప్రదీప్, తదితర కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

నందిపేట టూ నిజామాబాద్‌కు ఎక్స్‌ప్రెస్ బస్‌లు

నందిపేట, ఆగస్టు 8: నందిపేట నుంచి నిజామాబాద్ వరకు రెండు ఎక్స్‌ప్రెస్ బస్‌లను ఆర్టీసీ అధికారులు వేశారు. వాటిని గురువారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మంద మహిపాల్ ప్రారంభించారు. నందిపేట ప్రయాణీకుల సౌకర్యార్థం రెండు ఎక్స్‌ప్రెస్ సర్వీస్‌లను వేయాలని ఇటీవల ఆర్మూర్ నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ప్రొద్దుటూరి వినయ్‌రెడ్డి ఆధ్వర్యంలో నందిపేట కాంగ్రెస్ నాయకులు నిజామాబాద్ ఆర్ఎం జాన్‌రెడ్డిని కలిశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మంద మహిపాల్, మండల మైనార్టీ అధ్యక్షులు యూసుఫ్, నాయకులు ఎడ్లిగారి నిఖీల్, మేర ప్రవీణ్, శ్రీను, ఆర్టీసీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

బంగ్లాదేశ్ జాతీయ జెండా దహనం

పెర్కిట్, ఆగస్టు8: బంగ్లాదేశ్ హిందువులపై జరుగుతున్న అరాచాకాలకు నిరసనగా గురువారం ఆర్మూర్ పట్టణంలోని అంబేద్కర్‌చౌరస్తా వద్ద బీజేపీ నాయకులు బంగ్లాదేశ్ జాతీయ జెండాను దహనం చేశారు. బంగ్లాదేశ్ రిజర్వేషన్ల కోసం జరుగుతున్న ఉద్యమంలో హిందు దేవాలయాలను, హిందువుల ఇళ్లను లూటీ చేయడం ఆందోళకరమైన విషయమని అన్నారు. ఇకనైనా బంగ్లాదేశ్‌లో హిందువులపై అరాచాకాలను వెంటనే అపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి ఆర్మూర్, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ జీవీ.నర్సింహరెడ్డి, ఆర్మూర్ పట్టణశాఖ అధ్యక్షుడు ద్యాగ ఉదయ్, జిల్లా అధికార ప్రతినిధి కలిగోట గంగాధర్, సీనియర్‌నాయకుడు ఆకుల శ్రీనివాస్, జెస్సు అనిల్, బీజేపీ జిల్లా బీసీ మోర్చా యామాద్రి భాస్కర్, మందుల బాలు, తదితరులు పాల్గొన్నారు.

సిరికొండలో సుదర్శన్‌రెడ్డి జన్మదిన వేడుకలు

సిరికొండ ఆగస్టు 2: బోధన్ ఎమ్మెల్యే మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా సిరికొండలో శుక్రవారం కాంగ్రెస్ నాయకులు కేక్ కట్ చేసి సంబరాలు జపుకున్నారు. తెలంగాణ చౌరస్తాలో కాంగ్రెస్ నాయకులు కేక్ కట్ చేసి ప్రజలకు, కార్యకర్తలకు స్వీట్లను పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రవి, జిల్లా నాయకులు ఎర్రన్న, బాకారం సంతోష్, దేగం సాయన్న,కుందేళ్ల శ్రీనివాస్, రమేష్, జీవన్, రాంరెడ్డి,మల్లేష్, సంతోష్ నాయక్,బాస్కర్‌రెడ్డి, ప్రణీత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మోర్తాడ్‌లో నాగదేవతకు బోనాలు

మోర్తాడ్, ఆగస్టు8: మండల కేంద్రంలోని గోవింద్‌రెడ్డి కాలనీలో నాగదేవత ఆలయ వార్షికోత్సవం సందర్భంగా బోనాలతో భారీ ఎత్తున మహిళలు బోనాలతో పూజలు నిర్వహించారు. తొలుత కాలనీకి చెందిన మహిళలు అధిక సంఖ్యలో మంగళహారతులు, గంగజలాలతో, బోనాలతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు.అనంతరం గంగాజలాలతో ఎల్లమ్మ ఆలయం జలాభిషేకం చేశారు. నాగదేవత ఆలయంలో జలాభిషేకం చేసి అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలని ధర్నా

ముప్కాల్, ఆగస్టు8: బాల్కొండ మండల కేంద్రంలోని డబుల్‌బెడ్‌రూం ఇళ్లకాలనీలో మౌలిక వసతులు కల్పించాలని గురువారం కాలనీవాసులు గ్రామ పంచాయతీ ఎదుట ధర్నా నిర్వహించారు. కాలనీలో తాగునీరు, విద్యుత్, డ్రైనేజీ, వర్షపునీరు నిల్వ ఉండి కాలనీలో గుంతలు ఏర్పడి దోమలు వృద్ధి చెందుతున్నాయని, దీంతో అంటు వ్యాధులు ప్రబలుతున్నాయని వెంటనే అధికారులు చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో డబుల్‌బెడ్‌రూం ఇళ్ల కాలనీవాసులు పాల్గొన్నారు.

పీజీ 2వ సెమిస్టర్ ఇంటిగ్రేటెడ్ , 8వ సెమిస్టర్ రెగ్యులర్ బ్యాక్‌లాగ్ పరీక్షల టైం టేబుల్ విడుదల

డిచ్‌పల్లి,ఆగస్టు 8: తెలంగాణ యూనివర్సిటీ పీజీ ఎంఏ, ఎంకాం, ఎంఎస్‌డబ్ల్యూ, ఎంఎస్సీ, ఎంబీఏ,ఎంసీఏ, 2వ సెమిస్టర్, 5ఏళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సుల ఏపీఈ, ఐఎంబీఏ, ఐపీసీహెచ్, 8వ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లగ్, బీఎల్ ఐఎస్సీ బ్యాక్‌లాగ్ పరీక్షల టైం టేబుల్ గురువారం విడుదల చేసినట్లు సీవోఈ ప్రొ.అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 27నుంచి సెప్టెంబరు 6 వరకు జరుగుతాయని పూర్తి వివరాలకు తెలంగాణ యూనివర్సిటీ వెబ్ సైట్ సంప్రదించాలని సూచించారు.

వర్షానికి కూలిపోయిన ఇంటి పై కప్పు


కూలిపోయిన ఇంటిపై కప్పు

సిరికొండ ఆగస్టు 2: సిరికొండ మండలంలోని గడ్డమీది తండాలో శుక్రవారం ఉదయం ఇల్లు కూలిపోయింది. గత వారం పది రోజులుగా కురుస్తున్న ముసురు వానకు ఇల్లు తడిసి పోయి కూలి పోయింది. ఇల్లు కూలిన సమయంలో ఇంటిలో ఎవరు లేక పోవడం వల్ల ఎలాంటి ప్రాణ నష్టం సంభవించలేదని తండాకు చెందిన లక్ష్మన్ తెలిపారు. మళ్లీ వర్షం కురుస్తే ఇబ్బంది అవుతుందిన కుటుంబం సభ్యులు ఇంటిని ఖాలి చేసి ఇతరులు ఇంటిలో నివాసముంటున్నారు. ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని యజమాని బట్టు లాలు విజ్ఞప్తి చేశారు.

నవీపేట సంతలో గుంతల పూడ్చివేత

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


నవీపేట సంతలో మొరంతో గుంతలను చదును చేయిస్తున్న దృశ్యం

నవీపేట,ఆగస్టు8: నవీపేట గ్రామ పంచాయతీ పరిధిలోని వారంతపు సంతలో ఏర్పడిన గుంతలను గురువారం అధికారులు మొరంతో పూడ్చివేసి చదును చేయించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు సంత పూర్తిగా బురదమయంగా మారడంతో గత నెల 27న ఆంధ్రజ్యోతిలో "చిత్తడిగా మారిన సంత" అనే వార్తకు అధికారులు స్పందించారు. సంతలో ప్రతి శుక్రవారం వారంతపు సంత, శనివారం మేకల సంత నిర్వహిస్తుండడంతో సంత పూర్తిగా బురదమయంగా మారడంతో అమ్మకందారులు, కొనుగోలుదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సంతలో ఉన్న బురదను తొలగించి మొరంతో గుంతలను పూడ్చివేసి చదును చేయించడానికి కృషి చేసిన ఆంధ్రజ్యోతికి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.


మంత్రి సీతక్కకు వినతిపత్రాన్ని అందజేస్తున్న దృశ్యం

కాలనీలో సౌకర్యాలను కల్పించాలని మంత్రికి వినతి

భిక్కనూరు, ఆగస్టు 8: మండలంలోని జంగంపల్లి మల్లు స్వరాజ్యం కాలనీలో కాలనీవాసులకు కనీస సౌకర్యాలను కల్పించాలని కోరుతూ గురువారం హైదరాబాద్‌లో మంత్రి సీతక్కకు తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొత్త నర్సింలు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నర్సింలు మాట్లాడుతూ గత రెండు సంవత్సరాలుగా కాలనీలో విద్యుత్, మంచినీటి సౌకర్యం, మురికి కాలువలు లేక కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, గతంలో ప్రజా ప్రతినిధులకు, అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి కాలనీవాసులకు విద్యుత్ మీటర్లను అందజేసి మంచినీటి సౌకర్యం, మురికి కాలువలను నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ప్రతినిధులు, కాలనీవాసులు పాల్గొన్నారు.


జంగంపల్లి విండోలో రుణాలకు దరఖాస్తులు తీసుకుంటున్న దృశ్యం

రుణమాఫీ అయిన రైతులకు రుణాలు అందజేత

భిక్కనూరు, ఆగస్టు 8: మండలంలోని జంగంపల్లి విండో పరిధిలో రుణమాఫీ అయిన రైతులకు కొత్త రుణాలు అందజేస్తున్నట్టు డీసీసీబీ డైరెక్టర్ గోండ్లె సిద్ధరాములు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విండో పరిధిలో ఇప్పటి వరకు రుణమాఫీ అయిన 101 మంది రైతులకు రూ.59.20 లక్షలను, ఏడుగురు కొత్త సభ్యులకు రూ.1.97లక్షలు అందజేవామన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో విండో సీఈవో మాద్దుల రమేష్ యాదవ్, డైరెక్టర్లు పాల్గొన్నారు.


భిక్కనూరు ఈవో మహేష్‌కు రాఖీ కడుతున్న దృశ్యం

ఓంశాంతి ఆధ్వర్యంలో రక్షాబంధన్

భిక్కనూరు, ఆగస్టు 8: మండల కేంద్రంలో ఓంశాంతి ఆధ్వర్యంలో గురువారం రక్షాబంధన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని ఆయా ప్రభుత్వ కార్యాలయాల్లో, గ్రామ పంచాయతీ కార్యాలయంలో అధికారులకు, సిబ్బందికి ఓంశాంతి ప్రతినిధులు రాఖీ కట్టి స్వీట్లు తినిపించారు. ఈ మేరకు ఓంశాంతి ప్రతినిధులు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ రక్షాబంధన్ పండుగను సంతోషంగా గడుపుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఓంశాంతి ప్రతినిధులు పాల్గొన్నారు.


ప్రాజెక్టు అధికారులతో మాట్లాడుతున్నఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి

నిజాంసాగర్ ప్రాజెక్టును పరిశీలించిన ఎమ్మెల్యే పోచారం

నిజాంసాగర్, ఆగస్టు 8: నిజాంసాగర్ ప్రాజెక్టును గురువారం మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. బాన్సువాడ నుంచి హైదరాబాద్ వెళుతున్న సమయంలో మార్గమధ్యలో నిజాంసాగర్ ప్రాజెక్టును పరిశీలించి, నీటి నిల్వలు, ఇన్‌ఫ్లో తదితర వివరాలను ప్రాజెక్టు అధికారులను అడిగి తెలుసుకున్నారు. అవుట్ ఫ్లో ఎంత ఉంది, తదితర వివరాలను నీటి పారుదల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సాల్మన్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 3.9 టీఎంసీల నీరు నిల్వ ఉందని, 400 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుందని అధికారులు వివరించారు. ఆయన వెంట అధికారులు, నాయకులు తదితరులున్నారు.

'స్వచ్ఛదనం-పచ్చదనం'ను పకడ్బందీగా నిర్వహించాలి

కామారెడ్డి టౌన్, ఆగస్టు 8: కామారెడ్డి పట్టణంలోని స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. అశోక్‌నగర్ కాలనీలో 15, 16 వార్డుల్లో ఉన్న ప్రభుత్వ బాలికల బీసీ హాస్టల్, కాలేజీలను మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు రాకుండా, దోమలు, ఈగల సంతతి పెరగకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. ప్రజలు అధికారులు, సిబ్బందికి సహకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్‌లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గాంధారి: స్వచ్ఛత కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం గాంధారి మండలంలో ఆయన పర్యటించారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో మహిళలతో సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం గ్రామంలోని పాత పోలీసు స్టేషన్ సమీపంలో మొక్కలు నాటారు. గ్రామాలు స్వచ్ఛదనం- పచ్చదనంతో ఉండాలని అన్నారు. గిరిజన గురుకుల పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఆసుపత్రి సిబ్బందితో మాట్లాడి సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఆయన వెంట తహసీల్దార్ సతీష్‌రెడ్డి, ఎంపీడీఓ రాజేశ్వర్, డిప్యూటీ తహసీల్దార్ రవి, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, ఏపీ గంగారాజు, సీసీరాజు, కారోబార్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

బాన్సువాడ టౌన్: బాన్సువాడ పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో గురువారం అధ్యాపకులు, విద్యార్థినులు స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమం నిర్వహించారు. ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొని కళాశాల ప్రాంగణంలో గల పిచ్చి మొక్కలను తొలగించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అసద్ ఫారుఖ్, అధ్యాపకులు, విద్యార్థినులు తదితరులున్నారు.

దోమకొండ: మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కామారెడ్డి డిపో మేనేజర్ ఇందిర ఆధ్వర్యంలో ప్రయాణ ప్రాంగణంలో గురువారం వనమహోత్సం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి నిజామాబాద్ ఆర్ఎం జానిరెడ్డి హాజరయ్యారు. బస్టాండ్ ఆవరణలో మొక్కలు నాటి నీరు పోశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా రీజినల్ పరిధిలో కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. బస్టాండ్ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. దోమకొండకు షటిల్ బస్సు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని కామారెడ్డి నుంచి దోమకొండకు షటిల్ బస్సును నడపాలని మాజీ జడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్ ఆర్ఎంకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ లింగమూర్తి, మెకానికల్ ఇంజనీర్ వసుంధర, అకౌంటెంట్ ప్రతిభ, క్రిష్ణమూర్తి, రమేష్, సిబ్బంది ముత్యం, బాలయ్య, కర్రోల్ల శ్యామ్ సుందర్‌గౌడ్, నారాగౌడ్, రఫీక్, గంగాధర్, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.


అశోక్‌నగర్‌లో పరిసరాలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్


గాంధారిలో మొక్కను నాటుతున్న అదనపు కలెక్టర్


దోమకొండలో మొక్క నాటుతున్న ఆర్ఎం జానిరెడ్డి


బాన్సువాడ కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటుతున్న దృశ్యం

విద్యార్థులు క్షణికావేశాలకు లోను కావొద్దు

- మానసిక వైద్య నిపుణులు జి.రమణ


బిచ్కుందలో మాట్లాడుతున్న వైద్యుడు రమణ

మద్నూర్/బిచ్కుంద, ఆగస్టు 8: జిల్లాలో మద్నూర్, బిచ్కుంద ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో గురువారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జిల్లా మానసిక ఆరోగ్య కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా మద్నూర్‌లో సీజనల్ వ్యాధులతో పాటు మానసిక ఆరోగ్యం ముఖ్యమేనని విద్యార్థులకు డోంగ్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ శ్రీలేఖ సూచించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మానసిక వైద్య నిపుణులు డాక్టర్ జి.రమణ మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షల్లో ఫెయిల్ అయ్యామని, తక్కువ మార్కులు వస్తున్నా యని, సమాజంలో అవహేళనకు గురవుతున్నామని క్షణికావేశాలకు లోనై ఆత్మహత్యలు చేసుకోవద్దని భవిష్యత్తులో చాలా రకాల అవకాశాలు ఉంటాయని, అందుకు తగు విధంగా మానసిక పరిపక్వతతో తయార వ్వాలని సూచించారు. అంతేకాకుండా ఈ వయసులో మత్తు పదార్థాల జోలికి అస్సలు వెళ్లకూడదని, మొబైల్ ఫోన్ వినియోగం ఎక్కువగా చేయకూడదని, అవసరమైనంత మేరకు మాత్రమే మొబైల్ వాడాలని వాటికి బానిస కావద్దని తెలిపారు. ఇటీవల ఆత్మహత్యలు పెరుగుతున్న క్రమంలో జరిపిన సర్వేల్లో ఇవే విషయాలు స్పష్టం చేశాయని, ఈ యుక్త వయస్సులో ప్రేమలకు సైతం తావివ్వొద్దని, అవి ఆకర్షణ మాత్రమేనని, ఈ వయస్సులో వచ్చే కొద్దిపాటి ఆలోచనలు మాత్రమేనని, ఆ ఆలోచనలను పక్కకు పెడుతూ చదువుపై దృష్టి పెట్టి లక్ష్యానికి చేరువ కావాలని అన్నారు. తల్లిదండ్రు లు, అధ్యాపకులు చెప్పిన మాటలను వినాలని మానసిక అనారోగ్యానికి గురి కావద్దని తెలిపారు. అలాగే ఎవరికైనా మానసిక ఆందోళనకు గురవుతే నేరుగా టోల్ ఫ్రీ నెంబర్ 14416కి కాల్ చేసి సందేహాలను నివృత్తి చేసుకుంటూ మానసిక ఆరోగ్యంపై దృఢత్వాన్ని పెంచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పాండురంగం, సోషల్ వర్కర్ డాక్టర్ రాహుల్‌కుమార్, సబ్ యూనిట్ ఆఫీసర్ సుధాకర్, ఆరోగ్య కార్యకర్త స్వప్న, ఆశాలు, అధ్యాపకులు, గంగాధర్, ధనుంజయ్, సంపత్‌రెడ్డి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


మురికి కాలువలను శుభ్రం చేయిస్తున్న దృశ్యం

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

సదాశివనగర్, ఆగస్టు 8: గ్రామాల్లో ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటేనే వ్యాధులకు దూరంగా ఉంటారని ఎంపీఓ సురేందర్ రెడ్డి అన్నారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో స్వచ్ఛత కార్యక్రమాలను చేపట్టారు. డ్రైనేజీల వెంబడి దోమల నివారణ మందు పిచికారీ చేయడం, మురుగు కాలువలను శుభ్రం చేయడం పరిసర ప్రాంతాల్లో చెత్తను తొలగించడం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఇళ్లలో కుండీల్లో డ్రమ్ముల్లో పాత పెంకులలో నీరు నిల్వకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మాధవీ లత, సీహెచ్‌ఓ నాగరాజు సిబ్బంది పాల్గొన్నారు.

మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం

సదాశివనగర్, ఆగస్టు 8: అంబేద్కర్ యువజన సంఘం సదాశివనగర్ ఆధ్వర్యంలో మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు డాకయ్య మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా ఎస్సీ వర్గీకరణ కోసం అలుపెరగని పోరాటం చేసిన మంద కృష్ణ మాదిగ కృషితో ఏబీసీడీ వర్గీకరణ సాధ్యమైందన్నారు. మందకృష్ణ మాదిగల కోసం పోరాటం చేసినందుకు మాదిగల కులస్తుల తరపున ధన్యవాదాలు తెలుపుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవి, రమేష్, సంతోష్, సాయిలు, దీపక్, నారాయణ, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుల సేవలు మరువలేనివి

సదాశివనగర్, ఆగస్టు 8: మండలంలోని అమర్లబండ ప్రాథమిక పాఠశాలలో 10 సంవత్సరాలుగా పని చేసిన ప్రధానోపాధ్యాయుడు రాజిరెడ్డి సేవలు మరువలేనివని గ్రామస్థులు తెలిపారు. ప్రస్తుత ప్రధానోపాధ్యాయుడు సాయిగౌతమ్ ఆధ్వర్యంలో బదిలీపై వెళ్లిన ప్రధానోపాధ్యాయుడికి ఘనంగా సన్మానించారు. పది సంవత్సరాలు అందరిలో మమేకమై గ్రామస్థులతో అన్యోన్యంగా మెలుగుతూ విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దిన ఉపాధ్యాయుడు వెళ్లిపోవడం తీరనిలోటు అన్నారు. ఈ కార్యక్రమంలో తోటి ఉపాధ్యాయులు, గ్రామ ప్రజలు విద్యార్థులు పాల్గొన్నారు.


అమెరికాలో సీఎం రేవంత్‌రెడ్డితో ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు

అమెరికాలో సీఎంతో ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు

ఎల్లారెడ్డి, ఆగస్టు 8: అమెరికాలోని టెక్సాస్ నగరంలోని జరిగిన తెలంగాణ ఓవర్సీస్ కాంగ్రెస్ నాయకులు గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి, వెంకటరెడ్డి, శ్రీధర్‌బాబుతో పాటు ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

ఎల్లారెడ్డి, ఆగస్టు 8:సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎల్లారెడ్డి ఎంపీవో ప్రకాష్ అన్నారు. గురువారం ఎల్లారెడ్డి మండలంలోని బ్రాహ్మణపల్లి, వెల్లుట్ల గ్రామాల్లో అవగాహన ర్యాలీ కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం వార్డుల్లో తిరుగుతూ ఇంటి పరిసరాలలో నీరు నిల్వ ఉండకుండా చూడాలని ప్రజలకు సూచించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సీజనల్ వ్యాధుల పట్ల వైద్య ఆరోగ్యశ్రీ అందుబాటులో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీలు ముమ్మరం చేయాలి

మద్నూర్, ఆగస్టు 8: ఇతర రాష్ట్రాల నుంచి మత్తు పదార్థాలు రాష్ట్రంలోకి రాకుండా ప్రతీ వాహనాన్ని తనిఖీ చేయాలని జిల్లా ఎక్సైజ్ ఇన్‌చార్జి ఈఎస్ హనుమంతరావు ఎక్సైజ్ అధికారులకు సిబ్బందికి సూచించారు. గురువారం మండలంలోని సలాబత్పూర్ చెక్ పోస్టు వద్ద వాహనాలను తనిఖీ చేశారు. కార్యాలయంలోని రికార్డులను పరిశీలించి సిబ్బందితో మాట్లాడుతూ సరిహద్దు ఎక్సైజ్ చెక్ పోస్టులో విధులు నిర్వహిస్తున్న అధికారులు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని వాహనాలను ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాలని మత్తు పదార్థాలు రవాణా కాకుండా గట్టి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆయనతో పాటు ఎక్సైజ్ చెక్‌పోస్టు సిఐ జావేద్, బిచ్కుంద సీఐ సత్యనారాయణ, ఎస్సై నగేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ నూతన కార్యవర్గం ఎన్నిక

మద్నూర్, ఆగస్టు 8: మండల పీఆర్‌టీయూ అధ్యక్షుడిగా శివరాం, ఉపాధ్యక్షుడిగా భీమ్‌రావు, ప్రధాన కార్యదర్శి సురేష్, అసోసియేట్ అధ్యక్షుడిగా సాయిలు, ఉప అధ్యక్షుడిగా శివ శంకర్, మహిళా అధ్యక్షురాలుగా ఉమారాణి, ప్రధాన కార్యదర్శిగా అనితలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి కుశాల్ తెలిపారు.

బైక్ కొనివ్వలేదని తండ్రిని చంపిన తనయుడు

- మద్నూర్‌లో విషాదం

మద్నూర్, ఆగస్టు 8: తండ్రి బైక్ కొనివ్వలేదన్న కోపంతో.. తనయుడు కర్రతో బాదడంతో అతను అక్కడికక్కడే మృతి చెందిన ఘటన మద్నూర్‌లో బుధవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మద్నూర్‌కు చెందిన నార్లవార్ అర్జున్(64) కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇతనికి కుమారుడు నార్లవార్ వెంకట్ ఉన్నాడు. వెంకట్ చదువు మధ్యలోనే ఆపేసి.. గ్రామంలో జులాయిగా తిరుగుతుంటాడు. అయితే గత కొంత కాలంగా తండ్రి అర్జున్‌ను బైక్ కొనివ్వాలని వెంకట్ డిమాండ్ చేస్తూ వస్తున్నాడు. ఇందులో భాగంగా బుధవారం అర్ధరాత్రి బైక్ కొనివ్వాలని తండ్రితో ఘర్షణకు దిగాడు. తన వద్ద డబ్బులు లేవని.. అందువల్ల బైక్ కొనివ్వలేదని కొడుకుకు తండ్రి అర్జున్ తెగేసి చెప్పాడు. దీంతో కోపోద్రిక్తుడైన కుమారుడు వెంకట్ పక్కనే ఉన్న కర్రతో తండ్రి తలపై బలంగా కొట్టడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడి భార్య ఎల్లవ్వ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్‌షాక్‌తో ఒకరి మృతి

గాంధారి, ఆగస్టు 8: మండలంలోని చద్మల్‌తండాకు చెందిన మలోత్‌గోపాల్(30) అనే వ్యక్తి బుధవారం బీర్మల్ తండాకు చెందిన తన బావ దగ్గరకు వచ్చాడు. తిరిగి చద్మల్‌తండాకు వెళ్తుండగా రాత్రి సమయంలో అనుకోకుండా రోడ్డు నుంచి పొలాల వైపు వెళ్లాడు. దౌలత్‌రామ్ వ్యవసాయ పొలంలో కరెంటు వైరు కిందకి పడడంతో అది గోపాల్ కాలికి తగిలి విద్యుత్‌షాక్‌తో మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న ఎస్‌ఐ ఆంజనేయులు అక్కడికి చేరుకుని పంచనామా నిర్వహించి మృత దేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. మృతుడి భార్య మాలోత్ షాను కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి ఇద్దరు కూమారులు, భార్య ఉన్నారు.

అక్రమ విద్యుత్ కేసులో ఒకరికి ఐదేళ్ల జైలు

లింగంపేట, ఆగస్టు 8: అక్రమంగా పంట పొలానికి కరెంటు వైరు అమర్చి యువకుడి మరణానికి కారణమైన నిందితుడు మెంగారం గ్రామానికి చెందిన తలారి సాయిలుకు ఐదు సంవత్సరాల జైలు శిక్ష, 15వేలు జరిమానా విధిస్తూ గురువారం కామారెడ్డి జిల్లా న్యాయాధికారి లాల్‌సింగ్ శ్రీనివాస్ నాయక్ తీర్పు వెల్లడించినట్లు ఎస్పీ సింధూ శర్మ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వివరాలు ఇలా ఉన్నాయి.. మెంగారం గ్రామానికి చెందిన చౌల దత్తు(25) అనే యువకుడు అదే గ్రామానికి చెందిన తలారి సాయిలు బోరు నుంచి 10 ఏళ్లుగా తన పొలానికి నీరు తీసుకుని పంట పండిస్తున్నాడు. దానికి గాను పండించిన పంటలో కొంత మొత్తం తలారి సాయిలుకు ఇస్తున్నాడు. 2018 అక్టోబరు 14న దత్తు పొలానికి వెళ్లి తిరిగి రాకపోవడంతో మరుసటి రోజు దత్తు భార్య పవన్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు విచారణ చేపట్టగా దత్తు తలారి సాయిలు తన పొలానికి పెట్టిన విద్యుత్ జీఏ వైరుకు తగిలి చనిపోవడంతో నేరం తన మీదకు వస్తుందని ఊహించిన సాయిలు దత్తు మృతదేహాన్ని పొలం పక్కనే ఉన్న చెరువులో ఉద్దేశపూర్వకంగానే పారవేసినట్లు సాక్షాలు లేకుండా చేశాడు. మృతుడి భార్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ జరిపి సాక్ష్యాధారాలను సేకరించి కోర్టులో చార్జిషీటు వేశారు. కేసు సాక్ష్యాధారాలను, పూర్వాపరాలను పరిశీలించిన కామారెడ్డి జిల్లా అదనపు న్యాయాధికారి దత్తుచావుకు కారణమైన తలారి సాయిలుకు 5 సంవత్సరాల జైలుశిక్ష, రూ.15వేలు జరిమానా విధిస్తూ తీర్పును వెల్లడించినట్లు ఎస్పీ తెలిపారు. కేసును సరైన పద్ధతిలో విచారణ జరిపిన అప్పటి సీఐ సుధాకర్, ఎస్సై సుఖెందర్‌రెడ్డి, పీపీ నందరమేష్, కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టిన ప్రస్తుత సీఐ రవీందర్‌నాయక్, ఎస్సై చైతన్య కుమార్‌రెడ్డి, కోర్టు కానిస్టేబుల్ కిరణ్‌గౌడ్‌లను ఎస్పీ అభినందించారు.

విధులను బహిష్కరించిన న్యాయవాదులు

బాన్సువాడ టౌన్, ఆగస్టు 8: జనగామలో న్యాయవాదులు అమృత్ రావు, కవిత దంపతులపై దాడిచేసిన పోలీసులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం బాన్సువాడ కోర్టులో న్యాయవాదులు విధులను బహిష్కరించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణమూర్తి మాట్లాడుతూ న్యాయవాదులపై దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. దాడి చేసిన పోలీసులపై పోలీసు ఉన్నతాధికారులు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు లక్ష్మారెడ్డి, ఖలీల్, మొఘులయ్య, హమీద్ తదితరులున్నారు.


బాన్సువాడలో విధులను బహిష్కరిస్తున్న న్యాయవాదులు

కనీస వేతనాలు చెల్లించాలి

దోమకొండ, ఆగస్టు 8: కనీస వేతనాలను అమలు చేసి మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని గురువారం దోమకొండ మండల జీపీ కార్మికులు ఎంపీడీవో ప్రవీణ్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని రాష్ట్ర వ్యాప్తంగా ఒక్క రోజు సమ్మె చేపట్టినట్లు కార్మికులు తెలిపారు. కార్యక్రమంలో కూర సంతోష్, నర్సింహారెడ్డి, శంకర్, శ్యామ్, నత్తి రమేష్, రాంలు, బాల్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ గిరిజన మోర్చా మండల అధ్యక్షుడిగా రాందాస్

లింగంపేట, ఆగస్టు 8: లింగంపేట మండల బీజేపీ గిరిజన మోర్చా అధ్యక్షుడిగా రాందాస్ నాయక్‌ను ఎన్నుకున్నట్లు జిల్లా కార్యవర్గ సభ్యుడు దత్తురాంలు తెలిపారు. మండల కేంద్రంలో నిర్వహించిన బీజేపీ మండల సమావేశంలో ఈ ఎన్నికలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన మోర్చా అధ్యక్షుడు నవీన్‌నాయక్, జహీరాబాద్ పార్లమెంట్ కన్వీనర్ రవి నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి రంజిత్, నాయకులు ఉన్నారు.

'పీఆర్‌సీని 42 శాతం ఫిట్‌మెంట్‌తో ప్రకటించాలి'

కామారెడ్డి రూరల్, ఆగస్టు 8: పీఆర్‌సీని 42 శాతం ఫిట్‌మెంట్‌తో ప్రకటించాలని కామారెడ్డి జిల్లా స్టేట్ టీచర్స్ యూనియన్ తెలంగాణ స్టేట్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలను వెంటనే విడుదల చేయాలని, 317 జీవో సంబంధిత సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు హన్మంత్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రాములు, కాజా మొయినుద్దీన్, రాజేందర్, కుర్షిద్ అహ్మద్, షాహీన బేగం, నాహీద్ ఫాతీమా, నటరాజు, మధు, రాజు తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి
- శాంతి - ఓసీ
- దర్శన్ - శివంభజే
- ప్రియా 70 - కల్కి
- ప్రియా 35 - రాయన్, బడ్డి

బాన్సువాడ
- మహేశ్వరి - తిరగబడర సామీ
- వెంకటేశ్వర - శివం భజే

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	160	200	220
వెన్‌కాబ్(కిలో)	:	170	220	230

